



19 వ వసంతంలోకి ...

సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 31 జనవరి 2026



# అధికార అహంకారానికి అద్దం పట్టిన ఘటన..!




## వీఆర్ఏల గౌరవాన్ని తాకట్టు పెట్టిన అధికార వ్యవస్థ

## ప్రజాస్వామ్యమా..? లేక ఆధునిక వెట్టి చాకిరీయా..?



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** నేనే అన్నిటికన్నా శుభప్రదం.. మంగళానికి నేనే చిహ్నం.. మిగతా ఆకులన్నీ అమంగళం.. అంటూ అహంకారంతో విర్రవీగిన మామిడాకు చివరకు తలకిందులుగా వేలాడాల్సి వచ్చిందన్న కథ నేటి అధికార వ్యవస్థకు అచ్చు గుద్దినట్లుగా సరిపోతుంది. ఎందుకంటే, ఎప్పటికైనా అహంకారం అనర్థానికే దారి తీస్తుందన్న సత్యం మరోసారి నిరూపితమైంది. గ్రామ పరిపాలనలో కీలక భూమిక పోషిస్తున్న గ్రామ సహాయకులు (వీఆర్ఏలు) ఈసారి అధికారుల అహంకారానికి బలయ్యారు. ప్రభుత్వ విధులు నిర్వర్తించాల్సిన వీఆర్ఏలను, వ్యక్తిగత పనుల కోసం వినియోగించుకున్న ఓ అధికారి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తిరువూరులో వీఆర్ఏలతో కారు కడిగించారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో, ఈ ఘటన అధికార వ్యవస్థలో పాతుకుపోయిన పెత్తన ధోరణికి నిదర్శనంగా నిలిచింది.

**ప్రభుత్వ ఉద్యోగులా..? వ్యక్తిగత సేవకులా..?**

సర్కారు జీతం తీసుకుంటూ, ప్రజాసేవ చేయాల్సిన అధికారి ప్రభుత్వ ఉద్యోగులైన వీఆర్ఏలను తన వ్యక్తిగత సేవకుల్లా వినియోగించడం రాజ్యాంగబద్ధమైన పాలనకు తగినదేనా అని ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో పేదరికం, సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు కోసం రాత్రింబగళ్లు పని చేసే వీఆర్ఏలకు కనీస గౌరవం కూడా లేకపోవడం ప్రజాస్వామ్యానికి చెంపపెట్టే చర్యగా ప్రజాసంఘాలు అభివర్ణిస్తున్నాయి. ఇది కేవలం ఒక అధికారి చేసిన తప్పుగా చూడలేమని, వ్యవస్థలో పాతుకుపోయిన అహంకార సంస్కృతికి ప్రతిబింబంగా ప్రజలు భావిస్తున్నారు. 2

## బిపీయస్‌కు ఇకపై దరఖాస్తు చేసుకోవచ్చు..

### లైసెన్స్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టిపి)ల అవసరం లేదు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ

వివరాలు 2 లో



## డివిజన్లలో జోరుగా ఎమ్మెల్యే బొండా జన్మదిన వేడుకలు

### మానవీయతకు నిలువెత్తు నిదర్శనంగా కార్యక్రమాలు

### 24వ డివిజన్ లో 300 మంది బాలికలకి అన్నదానం



విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ : ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ కస్తూరిబాయ్ పేట భిషప్ గర్ల్స్ హాస్టల్‌లో శుక్రవారం సాయంత్రం మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచే సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవరపు మాల్యాద్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో,

మిగతా 2లో

## డ్రైవర్ల అప్రమత్తతో రహదారుల ప్రమాదాలు నివారణ

### ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రహదారి ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, బందరు మాజీ పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏపీఎస్ఆర్టీసీ మచిలీపట్నం డిపో గ్యారేజ్ లో 37వ రోడ్డు భద్రత మాసోత్సవాలు ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పరిసరాలపై పూర్తి దృష్టి పెట్టడం, ఏమరపాటు లేకుండా, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా డ్రైవర్లు తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా సురక్షితంగా ఉంచగలరని, ఈ అంశాలను వారు దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చేందుకు నిత్యం వారికి పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## బిపీయస్‌కు ఇకపై దరఖాస్తు చేసుకోవచ్చు..



విజయవాడ, మేజర్ న్యూస్ : బిల్డింగ్ పినలైజేషన్ స్కీం ( బిపీయస్) కొరకు అవసరమైన వారు ఇకపై స్వయంగా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం వెసులు బాటు కల్పించిందని దీనిని సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి లక్ష్మిశ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్ (ఎల్ టిపి) లు అన్యాయమైన పద్ధతులకు పాల్పడుతున్నా యని, దరఖాస్తులను దాఖలు చేసే సమయంలో ప్రజల నుండి అదనపు మొ త్తాన్ని వసూలు చేస్తున్నారని ప్రజల నుండి వస్తున్న ఫిర్యాధుల నేపథ్యంలో ప్రభుత్వం బిల్డింగ్ పినలైజేషన్ స్కీం కు ప్రజలే స్వయంగా ధరఖాస్తు చేసుకు నేలా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ప్రమే యం లేకుండా పౌరులు నేరుగా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వార్డు సచివాలయాల ద్వారా బిపిఎస్ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆ ప్రకటనలో తెలిపారు.

## డ్రైవర్ల అప్రమత్తతో రహదారుల ప్రమాదాలు నివారణ

తీసుకుంటున్నామన్నారు. అతి తక్కువ రహదారి ప్రమాదాలు జరిగే సంస్థ కేవలం ఏపీఎస్ఆర్టీసీ మాత్రమేనని పేర్కొంటూ ప్రతి బస్సును మంచి కండిషన్లో ఉంచేందుకు నిత్యం తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాద నష్టాన్ని సరిదిద్ద లేనిదని బాధ్యతగా వ్యవహరించాలని డ్రైవర్లకు ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన, దాదాపు 20 నుంచి 30 సంవత్సరాలకు పైగా ఒక్కసారి కూడా ఎలాంటి యాక్సిడెంట్ లు చేయని 18 మంది బస్సు డ్రైవర్లను అభినందించి ప్రశంస పత్రాలు అందించారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ వారి సహకారంతో కొత్తగా శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా అధికారి ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాస్, మచిలీపట్నం డిపో మేనేజర్ పెద్దిరాజు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిద్ధిక్, ఎస్సీ కార్పొరేషన్ ఈవో సెల్వి, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పర్శ

రెడ్డిగూడెం, మేజర్ న్యూస్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ కార్యక్రమం లో భాగంగా రెడ్డిగూడెం మండలం లోని 12 సచివాలయం లలో స్పర్శ లెప్రసి అవేర్నెస్ క్యాంపైన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కు రెడ్డిగూడెం సచివాలయం లో వైద్యాధికారి , సర్పంచ్, వైద్య సిబ్బంది సూపర్వైజర్స్,ఏ ఎన్ ఎమ్ లు, ఎమ్ ఎల్ హెచ్ పి, ఆశలు సచివాలయం సిబ్బంది, ప్రజలు, అన్ని లైన్ డిపార్ట్మెంట్ సిబ్బంది, పాల్గొని. మహాత్మా గాంధీ కి నివాళులర్పించి, కుష్టు వ్యాధి గ్రస్తులు యందు వివక్ష చూపబోము అని, మనలో ఒకరు గా చూస్తాము అని ప్రతిజ్ఞ చేశారు. మరియూ కలెక్టర్ సందేశం, సర్పంచ్ సందేశం వినిపించడం జరిగింది. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని ఆసుపత్రి కి పంపిస్తాము అని ప్రతిజ్ఞ చేశారు. ఈ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఎమ్ డీ టి చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కీర్తి , రెడ్డిగూడెం సర్పంచ్ రాణి , సూపెర్వైసర్స్ రాంకుమార్, భవాని, ఎంఎల్ హెచ్పి రమణ, ఏఎన్ఎం సౌజన్య మరియు ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో జె.ఎన్.టి.యు.కె.
## అంతర కళాశాలల ఖో-ఖో టోర్నమెంట్ నిర్వహణ

గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జనవరి 30 : స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 31 జనవరి మరియు 1 ఫిబ్రవరి తేదీలలో జే.ఎన్.టి.యూ.కే. కాకినాడ అంతర్ కళాశాలల ఖోఖో టోర్నమెంట్ ను పురుషుల మరియు మహిళల విభాగాలలో నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ గుడివాడ వి.ధీరజ్ వినీల్, గౌరవ అతిథిగా కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు మరియు విశ్వవిద్యాలయ పరిశీలకునిగా జే.ఎన్.టి.యూ.కె కాకినాడ, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ జి.శ్యామ్ కుమారు లు రానున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలియజేశారు. రాష్ట్రంలోని తూర్పుగోదావరి, కోనసీమ అంబేద్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు మరియు ప్రకాశం జిల్లాలకు సంబంధించిన వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి సుమారు 650 మంది విద్యార్థినీ విద్యార్థులు మరియు 50 మంది మ్యాచ్ రిఫరీలుగా, ఆయా కళాశాలల టీమ్ కోచ్ లుగా, మేనేజర్ లుగా ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్నారని, క్రీడాకారులు ఇప్పటికే తమ తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివ శంకర్ కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ అన్నారు.

# అధికార అహంకారానికి అద్దం పట్టిన ఘటన..!

(మొదటిపేజీ తరువాయి)

**తక్కువ వేతనం.. ఎక్కువ అవమానం..!**

ఒకవైపు తక్కువ వేతనాలు, మరోవైపు అధిక పనిభారంఠ అయినా సరే గ్రామాల్లో ప్రభుత్వానికి ప్రతినిధులుగా నిలబడుతూ సేవలందిస్తున్న వీఆర్ఏలు, ఇప్పుడు అధికారుల అహంకారానికి బలవడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వీఆర్ఏలకు కనీస గౌరవం కూడా ఇవ్వలేని వ్యవస్థ ఎలా ప్రజాసేవ చేస్తుంది అన్న ప్రశ్న సామాన్యుల నోట వినిపిస్తోంది. ఈ ఘటనతో వీఆర్ఏల ఆత్మగౌరవం తీవ్రంగా దెబ్బతిందని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**వెట్టి చాకిరీ నిషేధ చట్టం కాగితాలకేనా..?**

దేశంలో వెట్టి చాకిరీ నిషేధ చట్టం అమల్లో ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని వామపక్షాలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు వినియోగించడం, చట్టపరంగా నేరమే కాకుండా మానవ హక్కుల ఉల్లంఘనగా అభివర్ణిస్తున్నారు. ఇది ఆధునిక వెట్టి చాకిరీ అని పలువురు నేతలు ఘాటుగా విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై వామపక్షాలు, మిత్రపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించాయి.

**ఇది ఒక వ్యక్తి చేసిన తప్పు కాదు...**

వ్యవస్థలో పాతుకుపోయిన దోపిడి సంస్కృతికి నిదర్శనం అని ప్రజాసంఘాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారుల తీరులో మార్పు రాకపోతే, ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతాయని హెచ్చరిస్తున్నారు.

**అధికార అహంకారమే అసలు సమస్య..!**

నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిపోతున్న అధికార అహంకారంనే ఇలాంటి ఘటనలకు మూలకారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ, ప్రజలనే తక్కువచూపు చూడడం ప్రజాస్వా



మ్యానికి ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. గ్రామ స్థాయిలో పనిచేసే వీఆర్ఏలపై ఇలాంటి వ్యవహారాలు కొనసాగితే, పరిపాలన వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని అంటున్నారు.

**ప్రభుత్వం స్పందిస్తుందా..? లేక మౌనమా..?**

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటుందా లేదా ఇది కూడా ఎన్నో ఘటనల మాదిరిగానే కాలగర్భంలో కలిసిపోతుందా అన్న మాట ఉత్పన్నమవుతుంది. వీఆర్ఏల గౌరవం, హక్కుల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం మౌనం పాటిస్తే, అది అధికారుల అహంకారానికి అండగా నిలిచినట్టేనని హెచ్చరిస్తున్నారు. గౌరవం లేకుండా పాలన సాధ్యమా అని ప్రశ్నిస్తున్నారు. వీఆర్ఏలు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదు గ్రామ పరిపాలనకు పునాది స్తంభాలనీ వారికి గౌరవం లేకుండా, న్యాయం లేకుండా పాలన సాగించడం అసాధ్యం. ఈ ఘటన ఒక హెచ్చరికగా తీసుకుని, అధికారుల తీరులో మార్పు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది. లేదంటే ప్రజల ఆగ్రహం ఉప్పెనలా ఎగసిపడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# డివిజన్లలో ఘనంగా ఎమ్మెల్యే బొండా జన్మదిన వేడుకలు



(మొదటిపేజీ తరువాయి)

హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్న సుమారు 300 మంది బాలికలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలికలతో కలిసి ఆప్యాయంగా కేక్ కట్ చేసి, వారి జీవితాల్లో చిరునవ్వులు పూయించారు. అనంతరం స్వయంగా భోజనాలు వడ్డించి, వారి క్షేమాన్ని అడిగి తెలుసుకోవడం ద్వారా తన సేవా దృక్పథాన్ని మరోసారి చాటుకున్నారు. ప్రజాసేవే తన జన్మదినోత్సవానికి నిజమైన ఆనందం ఎప్పుడూ ఆర్భాటాలకు



దూరంగా, ప్రజాసేవకే ప్రాధాన్యత ఇచ్చే నాయకుడిగా గుర్తింపు పొందిన బొండా ఉమ, తన జన్మదినాన్ని కూడా నిరుపేదలకు, బాలికల ఆశీర్వాదాలతో జరుపుకోవడం తమకు చాలా ఆనందంగా ఉంది. బొండా ఉమ అంటే సంక్షేమమే లక్ష్యంగా సాగే నాయకత్వం అని,సెంట్రల్ నియోజకవర్గంలో విద్య, ఆరోగ్యం, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు బొండా ఉమ గారని, నిరుపేద కుటుంబాలు, బాలికలు, వృద్ధులు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, అవసరమైన ప్రతి సందర్భంలో వారికి అండగా నిలుస్తున్న బొండా ఉమ కుటుంబం ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ అధ్యక్షులు గద్దం శ్రీనివాస్, ఐటిడిపి రాష్ట్ర నాయకులు కోలా దుర్గారావు, 24వ డివిజన్ నాయకులు గాజుల బ్రదర్స్, మేడసాని చంద్రశేఖర్,తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**31 డివిజన్లో శానిటరీ వర్కర్లకు దుస్తులు పంపిణీ**



విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు జన్మదిన వేడుకలు సందర్భంగా గవర్నమెంట్ ప్రెస్ దగ్గర కేక్ కటింగ్, సానిటరీ వర్కర్స్ కి చీరలు ఆడవారికి మగవారికి డ్రెస్సులు అన్నీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అధ్యక్ష కార్యదర్శులు సంతోషాన్ని వ్యక్తం చేశారు మనం చేసే ప్రతి కార్యక్రమానికి ప్రతి ఒక్కరు ఇదే విధంగా రావాలని తెలియజేశారు. డివిజన్ అధ్యక్షులు గద్దం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రాజేష్ వర్మ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవరపు మాల్యాద్రి, మాజీ కార్పొరేటర్ పిన్నం రాజు త్రిమూర్తి రాజు, సీనియర్ నాయకులు పడమటి రామకృష్ణ, మేడసాని చంద్రశేఖర్, కోటా నారాయణ, దెందుకూరి మురళీకృష్ణంరాజు, ప్రసాదు శేషమ్మ, బెజ్జం సురేష్, సన్నాల శ్రీనివాసరావు, చంటి లాలాజీ శ్రీరాములు అనిల్, మారుతి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# మొట్టమొదటి అతిపెద్ద 10,001 ఎంఏహెచ్ బ్యాటరీతో 'రియల్‌మీ పీ4 పవర్ 5జీ' ఆవిష్కరణ

**విజయవాడ, జనవరి 30, మేజర్ న్యూస్ :** భారతదేశంలో అత్యధికంగా సిఫారసు చేయబడిన యువత స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ, శుక్రవారం రియల్‌మీ పీ4 పవర్ 5జీని ఆవిష్కరిస్తోంది, ఇది స్మార్ట్‌ఫోన్ బ్యాటరీ ఇన్నోవేషన్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లే కీలక సాంకేతిక పురోగతిగా నిలుస్తూ, పరిశ్రమను 10,000ఎంఏహెచ్+యుగంలోకి నడిపిస్తోంది. భారతదేశంలో తొలిసారి 10,001ఎంఏహెచ్ టైటన్ బ్యాటరీతో ఉన్న రియల్‌మీ పీ4 పవర్ 5జీ, అతి దీర్ఘకాలిక పనితీరు కోసం కొత్త ప్రమాణాన్ని సెట్ చేస్తూ, ఫ్లాగ్‌షిప్-స్థాయి




పనితీరు, పెర్ల్ అకాడమీతో కలిసి రూపొందించిన బోల్డ్ జెన్ జెడ్‌ప్రేరణ పొందిన డిజైన్‌ను కలిపి అందిస్తుంది. ఈ మైలురాయ్ ప్రొడక్ట్ పీ సిరీస్‌లో అత్యంత ఆరాటపూర్వక పరిణామాన్ని సూచిస్తుంది, యువ వినియోగదారులకు కానుక లాంటి శక్తి దీర్ఘకాలికత, మృదువైన పనితీరు, ప్రత్యేకమైన విజువల్ ఐడెంటిటీని అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్ లాంచ్‌ను మరింత సమర్థంగా పూర్తి చేస్తూ, రియల్‌మీ టెక్‌లైఫ్ 45డబ్ల్యు కేబుల్డ్ పవర్ బ్యాంక్ రియల్‌మీ బ్యాటరీ సాంకేతికతలో నాయకత్వాన్ని మరింత బలపరుస్తుంది. భారీ 20,000ఎంఏహెచ్ కెపాసిటీ, 45డబ్ల్యు ఫాస్ట్ చార్జింగ్, మూడు అవుట్‌పుట్ పోర్ట్స్, మల్టీ-మోడ్ స్టెల్త్ డిస్‌ప్లేతో ప్రత్యేక 3డీ ట్రాన్స్‌పరెంట్ డిజైన్ ఫీచర్లతో, ఇది మీరు రోజు ఎక్కడికైనా వెళ్తున్నా స్మార్ట్‌ఫోన్ మించిన శక్తిని అందించేందుకు రూపొందించబడింది. ఈ సందర్భంగా సీఎంఓ ఫ్రాన్సిస్ వోంగ్ మాట్లాడుతూ రియల్‌మీ పీ4 పవర్ 5జీ భారతదేశంలో తొలి అత్యంత భారీ 10001 ఎంఏహెచ్ బ్యాటరీ స్మార్ట్‌ఫోన్ లాంచ్‌తో, మనం కేవలం ట్రెండ్‌ను అనుసరించడం కాదు, మనం దీర్ఘకాలికత కోసం కొత్త పరిశ్రమ ప్రమాణాన్ని నిర్ణయిస్తున్నామన్నారు. ఇది సగటు లావాదేవీలలోకి తగ్గకుండా, పారిస్ సెగ్మెంట్ లీడింగ్ పనితీరు, ధైర్యవంతమైన, ఫంక్షనల్ ఎస్తెటిక్స్ కలిపిన డివైస్. రియల్‌మీ బడ్స్ క్లిప్‌తో కలిసి, రియల్‌మీ ఆధునిక వినియోగదారునికి తెలివిగా స్టైల్-డ్రివెన్ ఈకోసిస్టమ్‌ను అందిస్తోందని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ విస్తృత కస్టమర్ బేస్ ద్వారా, మనం ఈ సాంకేతిక విప్లవాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామన్నారు. రియల్‌మీ పీ4 పవర్ 5జీ నిజమైన స్వేచ్ఛను సూచిస్తుందన్నారు. మన వినియోగదారులకు సాధారణాన్ని మించిపోతూ, పూర్తిగా వారి నియమాల ప్రకారం కనెక్ట్‌డ్‌గా ఉండడానికి నిరంతర శక్తిని అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ వైస్ ప్రెసిడెంట్, మొబైల్స్ కంచన్ మిశ్రా మాట్లాడుతూ ఫ్లిప్‌కార్ట్ రియల్‌మీతో భాగస్వామ్యం కై భారతదేశంలో పీ4 పవర్ 5జీని లాంచ్ చేయడానికి ఉత్సాహంగా ఉన్నామన్నారు. భారతదేశంలో తొలి, అత్యంత భారీ 10,001ఎంఏహెచ్ బ్యాటరీ స్మార్ట్‌ఫోన్లలో ఒకటిగా, ఈ డివైస్ దీర్ఘకాలిక, నమ్మకమైన శక్తికి వినియోగదారుల డిమాండ్‌ను తీర్చడంలో ముఖ్యమైన అడుగు ముందుకు తీసుకువస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం రియల్‌మీ ఇన్నోవేషన్-నిర్వహిత విధానాన్ని, ఫ్లిప్‌కార్ట్ దేశవ్యాప్తంగా వినియోగదారులకు వేరే, విలువ-ఆధారిత స్మార్ట్‌ఫోన్లు అందించడానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.

# వీరవల్లిలో 'స్పర్శ' కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమం

**హనుమాన్ జంక్షన్, జనవరి 30, మేజర్ న్యూస్ :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీరవల్లి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విరవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'స్పర్శ' కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి గ్రామ సర్పంచ్ పిల్ల అనిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీరవల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై. కిరణ్మయి, వీరవల్లి పంచాయతీ ఈఓ హరికృష్ణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్ల అనిత మాట్లాడుతూ, గాంధీజీ కుష్టువ్యాధి బాధితుల మధ్య సేవలు అందిస్తూ, అంటరానితనం నిర్మూలనకు జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తూ గ్రామ ప్రజలంతా కుష్టువ్యాధి నిర్మూలనకు సహకరించాలని ఆమె కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై. కిరణ్మయి మాట్లాడుతూ, కుష్టువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో



కుష్టువ్యాధికి పూర్తి స్థాయిలో ఉచిత చికిత్స అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు గ్రామంలో కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పంచాయతీ ఈఓ హరికృష్ణ కార్యక్రమంలో పాల్గొన్న వారితో కుష్టువ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శరత్ చంద్ర, వీఆర్ఓ సునీల్, హెల్త్ విసిటర్ నాగలక్ష్మి, ఏఎన్ఎం లు సునీత, కమలకుమారి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం



**గన్నవరం, జనవరి 30, మేజర్ న్యూస్ :** ముస్తాబాద నవభారత్ హై స్కూల్‌లో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్ పాఠశాల ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకు దేశవ్యాప్తంగా సైరాన్లు మోగించి అమరవీరులకు నివాళులర్పించాలని కేంద్ర ప్రభుత్వం కూడా సూచించిందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి బాపూజీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రామభద్ర రాజు, రామరాజు, జయ శ్రీ, విజయలక్ష్మి, జీవనజ్యోతి, లిల్లీ, సుభద్ర లక్ష్మీ ప్రసన్న, కరిష్మా, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కానుమోలు, పెరికిడులో నివాళులు

**హనుమాన్ జంక్షన్, మేజర్ న్యూస్ :** దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించి, ప్రపంచానికి అహింస మార్గాన్ని చూపిన మహనీయుడు, మానవ విలువలకు ప్రతీకగా నిలిచిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా




రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్ నాయకత్వంలో కానుమోలు గ్రామంలో హై స్కూల్ విద్యార్థులు, విద్యార్థినిలతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ చూపిన సత్యం, అహింస, త్యాగ భావనలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం పెరికిడు గ్రామంలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు ప్రవీణ్ కుమార్, బండారు సత్యనారాయణ, షేక్ రహీం, వెంకట రంగారావు పాల్గొన్నారు.

## నున్న గ్రామంలో మహాత్మా గాంధీజీ వర్ధంతి వేడుకలు....



**విజయవాడరూరల్ మేజర్ న్యూస్ :** నున్న గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సంద ర్భంగా నున్న గ్రామంలో గాంధీ విగ్రహానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉప సర్పంచ్ కే.బ్రహ్మానందరెడ్డి, ముత్తారెడ్డి, ఎంపిటిసి ప్రత్తిపాటి నాని, దండు సుబ్రహ్మణ్యం రాజు, పుల్లారెడ్డి, నాని, శేషు,అంగజాల హనుమ,గడ్డం కుమార్, ఇంద్ర, ప్రత్తిపాటి సుందరయ్య, కిరణ్, సుధాకర్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.

## వైసీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** శుక్రవారం స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి మాత్మ గాంధీ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పూలమాలలు



వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైసీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, నలుకుర్తి రమేష్, గోపి, లంకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 10వ తరగతి సీబీఎస్ఈ విద్యార్థుల కోసం

## మాక్ ప్రీబోర్డులను ప్రకటించిన ఫిజిక్స్‌వాలా

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈ ఏడాది 10వ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సహాయం చేసే లక్ష్యంతో విద్యా సంస్థ ఫిజిక్స్ వాలా ఒక విద్యార్థి మద్దతు చొరవను ప్రకటించింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉచిత సందేహ నివృత్తిని, నిపుణుల మార్గదర్శకత్వాన్ని ఈ కార్యక్రమం ద్వారా పొందవచ్చు. ఇది ఫిజిక్స్ వాలా విద్యార్థులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటుంది. పరీక్షల సమయంలో విద్యార్థులపై విద్యా సంబంధింత ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడేందుకు అనువుగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. విద్యార్థుల సంసిద్ధతను బలోపేతం చేసే ప్రయత్నంలో ఫిజిక్స్ వాలా దేశవ్యాప్తంగా సైన్స్, గణితంలో ఆఫ్‌లైన్ ప్రీబోర్డులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. నిజమైన బోర్డు పరీక్ష పరిస్థితులను అనుకరించడానికి, పరీక్ష జరిగే రోజుల్లోని పరిమితుల్లో విద్యార్థులు నైపుణ్యం, సమయ నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడటానికి ఈ పరీక్షలు ఫిజిక్స్ వాలా భౌతిక కేంద్రాలలో విద్యాపీఠ్, పాఠశాల, ట్యూషన్ సెంటర్లలో నిర్వహిస్తారు.

## ప్లీజ్ గ్రో అప్ పేరిట ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఫిజిటల్ రహదారి భద్రత ప్రచార కార్యక్రమం




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత్‌లో రోడ్డు ప్రమాదాలకు సంబంధించి మానవ తప్పిదాలే ఎక్కువ శాతం కారణంగా నిలుస్తున్న నేపథ్యంలో ప్లీజ్ గ్రో అప్ పేరిట ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఫిజిటల్ రహదారి భద్రత అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. రోడ్లపై అపరిపక్వమైన, బాధ్యతారహితమైన విధంగా వ్యవహరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ దాన్ని అంతగా ఎవరూ పట్టించుకోని నేపథ్యంలో ఆ విషయంపై అవగాహనను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. సాధారణంగా రోడ్డు ప్రమాదాలకు మౌలిక సదుపాయాల కొరత లేదా మెకానికల్ వైఫల్యాలు కారణమని చెబుతున్నప్పటికీ, స్పీడుగా వెళ్లడం, సిగ్నల్ జంపింగ్, అటూ ఇటూ చూస్తూ డ్రైవ్ చేయడం, మద్యం సేవించి డ్రైవ్ చేయడం, ప్రాథమిక భద్రతా ప్రమాణాలను కూడా పట్టించుకోకపోవడం మొదలైన వాటి వల్ల కూడా చాలా మటుకు ప్రమాదాలు జరుగుతుంటాయి. రోజువారీ డ్రైవింగ్ అలవాట్లను ప్రతిబింబించడం ద్వారా స్వీయ పరిశీలన చేసుకునేలా, జవాబుదారీతనాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. స్వీయ అవగాహన కలిగి ఉండి, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాల్సిన అవసరం కూడా ఇందులో భాగంగా ఉంటుందని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ వేలాయుధం తెలిపారు.

## ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి



**మొవ్వ మేజర్ న్యూస్:** జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాల సైతం లెక్కచేయకుండా పోరాడిన గొప్ప నాయకుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పువ్వాడ సురేష్, వాసవి క్లబ్ శ్రీ లక్ష్మీ గణపతి మొవ్వ అధ్యక్షులు నందిపాటి. రామచంద్రరావు, వాసవి క్లబ్ పిఆర్ఓ యెండూరి సతీష్, బెజవాడ. మోహన రాజా, కోట. భాస్కరరావు, మండవ. నాగేశ్వరరావు, పల్లంపాటి. వెంకట సత్యనారాయణ, మాటూరి.వెంకటేశ్వరరావు, మాటూరి.బ్రహ్మయ్య,పల్లంపాటి సాయి, పువ్వాడ. శ్రీనివాసరావు, నందిపాటి. సత్యనారాయణ, తదితరులు పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు.

## బాపూజీ 78వ వర్ధంతి వేడుకలు



**మొవ్వ మేజర్ న్యూస్:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య కళా పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా గాంధీ78వవర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళా పీఠం ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఎన్. వెంకటేశ్వరరావు, టీచింగ్ అసిస్టెంట్స్ డాక్టర్ వేదాంతం. వెంకట దుర్గా భవాని, పసుమర్తి. హరినాధ శాస్త్రి, గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపు. వేంకటేశ్వర ఫణి కుమార్, నాట్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చేనేత పరిశ్రమ అభివృద్ధికి కూటమి కృషి చేస్తుంది

### ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వెల్లడి

పెడన,మేజర్ న్యూస్ : చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ 200 యూనిట్స్ ఏప్రిల్ 1నుండి అమ‌లు చేయాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించ మని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పట్ట ణంలో గల తమ పార్టీ కార్యాలయములో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలా భిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లా డుతూ ఇటీవల జిల్లాలో థ్రిఫ్ట్ ఫండ్ బకాయిలు రూ.88 లక్షలు విడుదల చేసిందని, అలాగే చేనేత సహకార సంఘాలకు మిగిలిన బకాయిలు విడుద లకు మంత్రి సవిత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారని కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఉచిత విద్యుత్ పథకం కింద సుమారు 4200 మంది చేనేత కార్మికులు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేనేత పరిశ్రమ ను పూర్తి నిర్లక్ష్యం చేయడం వలన పరిశ్రమ అభివృద్ధి చెం దక కార్మికులు అనేక కష్టాలు పడుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చేనేత పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్ర మంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య,కట్టా మునేశ్వరావు, చేనేత సహకార సంఘాల మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో రికార్డుల మెయింటెనెన్స్ తప్పనిసరి



పెడన మేజర్ న్యూస్: ఎరువుల దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లు రికార్డులు తప్పక మెయింటింగ్ చేయాలని లేని చో చట్టపరమైన చర్యలు తప్పవని ఎయిర్పోర్ట్ప్రైం ట్ స్క్వాడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు జె.ఎస్ జయప్రద తెలిపారు. ఈ మేరకు శుక్రవా రం పట్టణంలో పలు ఎరువుల దుకాణాలలో అకస్మిక తనిఖీలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా శ్రీ లక్ష్మీ ఎంట ర్ప్రైజెస్, వెంకటరమణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, కోరమాండల్ ఇంటర్నే షనల్ లిమిటెడ్ మన గ్రోమోర్ సెంటర్ లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎరువుల లై సెన్స్, కాలపరిమితి, ఫర్టిలైజర్ స్టాక్ రిజిస్టర్, స్టాక్ సంబం ధించిన వాలిడిటీలో ఉన్న ఫారం ా లు తనిఖీ చేసి రూ.1,02,231 /-స్టాప్ సెల్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రికార్డ్స్ సరి చేసుకోకపోతే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వ్యవసాయ అధికారి ఎస్.జెన్ని తదితరులు ఉన్నారు.

## మహాత్ముని ఆశయాలు సాధిస్తాం...




విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ : మహాత్ముని జీవితం యావత్ ప్రపంచ మానవాళికి స్ఫూర్తి సందేశమని, మహాత్ముని ఆశయాలు సాధిస్తామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో శాసనసభ్యుని వారి కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీజీ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ సత్యం, అహింసలనే ఆయుధాలుగా మలుచుకుని దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిన మహనీయులు మహాత్మా గాంధీ అని కొనియాడారు.సత్యం, అహింసలే ఆయుధాలైన జాతిపిత మహాత్ముని జీవితం ఆదర్శమన్నారు.సత్యాగ్రహంతో, సహాయ నిరాకరణతో, అహింసా మార్గంలో నడిచి భారతీయులకు బానిసత్వం నుంచి విముక్తి కలిగించారని అన్నారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ స్థాపనను సీఎం చంద్రబాబు సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# అధిక పాల దిగుబడి సాధించాలి

### నాణ్యమైన మేలు జాతి గేదెలు కొనుగోలు చేయాలి

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ఘంటసాల, మేజర్ న్యూస్ : పాడి రైతులు నాణ్యమైన మేలు జాతి గేదెలు కొనుగోలు చేసి అధిక పాల దిగుబడి సాధించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండ లి బుద్ధప్రసాద్ సూచించారు. శుక్రవారం ఘంటసాలలో పశు వైద్యశాల వద్ద రాష్ట్ర గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, గేదె పదల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శిబిరాలను ప్రారంభించి ప్రసంగిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులు రూ. 6కోట్లతో నియోజకవర్గంలో గోకులం షెడ్లు నిర్మించినట్లు తెలిపారు. తద్వారా పశు సంపదకు సురక్షితమైన షెడ్లు ఏర్పాటు చేసి వాటి సంరక్షణకు, భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. తాను ఉమ్మడి రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పాడి రైతులకు పశుక్రాంతి పథకం ద్వారా హర్యానా నుంచి మేలు జాతి గేదెలు కొనుగోలు చేసి సబ్సిడీపై అందచేసినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలోనూ చంద్రబాబు మేలు జాతి పాడి గేదెలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి నియోజకవర్గంలో పశు వైద్యులు ఎక్కువ మంది డిప్యుటేషన్ పేరుతో ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించి, జిల్లా అధికారుల వద్ద పట్టుబట్టి మొత్తాన్ని వెనక్కు రప్పించినట్లు తెలిపారు. ఇంకా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ అంశం ఇప్పటికే రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. జిల్లాలో అత్యధిక పాల దిగుబడి సాధిస్తున్న ఘంటసాల గ్రామ పాడి రైతులు ఆదర్శనీయులు అన్నారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్చర్, లివర్ టానిక్, కాల్షియం సిరప్, బహుమతులు ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు.

**468 పశువులకు చికిత్స...** ఈ శిబిరంలో మొత్తం 468 పశువులకు చికిత్స చేశారు. గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేసి చికిత్స చేసి మందులు ఇచ్చారు. నట్టల నివారణకు మందులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావత్తుల వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.నాగభూషణం, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఆసుపత్రి దాత, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పశు సంవర్ధక శాఖ చల్లపల్లి, మొవ్వ అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ చిన వెంకటరెడ్డి, డాక్టర్ కోసూరు రవీంద్రరావు, పాల కేంద్రం అధ్యక్షులు గొర్రెపాటి సురేష్, డాక్టర్ హరిత, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ విజయ్, డాక్టర్ హరీష్, డాక్టర్ దేవిన హరీష్, జనసేన నాయకులు సుగ్గన పవన్ కుమార్, యార్ల శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండ్లి కుమారుడిగా మొవ్వ గోపాలుడు



మొవ్వ మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మొవ్వ లో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మొవ్వ వేణుగోపాల స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా ప్రారంభఠీ రోజైన శుక్రవారం ఆలయ అర్చకులు శ్రీ దీవి. సీతారామ హనుమా న్, వంశీ మోహన్లు శ్రీ వేణుగోపాల స్వామి వారిని పెండ్లి కుమారునిగా,శ్రీ రుక్మిణి సత్యభామ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానంలో మహాకవి క్షేత్రయ్య ఆరాధన ఉత్సవం ఆద్యంతం ఆహ్లాద వాతావరణంలో కొనసాగింది. అలాగే సంగీత గాత్ర విభావరి శ్రవణానందకరంగా సాగి రసజ్ఞులైన ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచెత్తింది. గుడివాడ కు చెందిన సంగీత విద్వాంసులు పోపూరి. శ్యామ సుందర్ శిష్యులైన మొవ్వ వి.ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకులు డాక్టర్ ఏ.వి.వి.మల్లేశ్వరమ్మ, సహచరగాయనీలు వి.రాజేశ్వరి, శివరంజని లతో కలిసి ఆలపించిన అన్నమాచార్య, త్యాగరాజు, రామదాసు కీర్తనలు పరవశింప చేశాయి. గణేష్ పంచరత్న కీర్తనలు, కృష్ణాష్టకం, సొగసు చూడతరమా, సంగీత జ్ఞానము, స్వాగతం కృష్ణ, గురుతెరిగిన, మాధవా కేశవా మధుసూదనా, గోవింద గోవింద అని, చూడరమ్మ సతులారా, తిరువీధుల మెరసే, గరుడ గమన తవ, అలర చంచలమైన, చూడరమ్మ సతులారా, ఇన్నిటంతట, నగవులు నిజమని, ఇట్టిముద్దులాడే, ఆకటి వేళల తదితర ప్రాచుర్యం పొందిన కీర్తనలను ఆలపించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎస్. వి.సుబ్బారావు, ఆలయ అర్చకులు దీవి.సీతారామ హనుమాన్, దీవి వంశీమోహన్ గాయని మనులను అభినం దించారు. తొలుత అన్నమా చార్య చిత్రపటానికి సంగీత నివాళులు అర్పించారు. అనంతరం సాయంత్రం గ్రామ సంకీర్తన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన,దీక్షాధారణ, అంకురారోహణ, అగ్ని ప్రతిష్టాపన, వాస్తు పూజ, వాస్తు హోమం, బేరి పూజ, ధ్వజారోహణ తీర్థ ప్రసాదాల వినియోగం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు.

# ఉపాధి హామీ చట్టం పరిరక్షణ ప్రతిజ్ఞ



మొవ్వ మేజర్ న్యూస్: సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త పిలుపుమేరకు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శు క్రవారం మండల పరిధిలోని మొవ్వ, గూడపాడు, కాజ, కోసూరు, చినముత్తేవి గ్రామాలలో మహాత్మా గాంధీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్య దర్శి శీలం. నారాయణరావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి ఆ స్థానం లో వి.బి. జీ రాంజీ అనే కొత్త చట్టాన్ని తీసుకొచ్చి పేదల కడుపు కొడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ, గాంధీజీని హత్య చేసిన వ్యక్తి పేరు వచ్చే విధంగా ఈ పథకంలో మార్పు చేసి రాష్ట్రాలపై భారం వేసి గాంధీ పేరు తీసివేయడం పట్ల నిరసన కార్యక్రమాలు చేపట్ట టం జరుగుతుందన్నారు. ఆ యా గ్రామాలలో జరిగిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో వ్యవసా య కార్మిక సంఘం మండల నాయకులు కొడాలి కరుణాకర్ రావు, చిగురుపల్లి సుబ్ర హ్మణ్యం, కొడాలి శ్రీనివాస రావు, ఉపాధి కార్మికులు శీలం కాటయ్య,జాన్, అయ్యంకి జీవరత్నం, జుజ్జువరపు బన్ను, సిహెచ్ నాగరాజు, జి. వసంతరావు, కొడాలి నాగేశ్వరరావు, కుంపటి. అనిల్, కే. నాగేశ్వరమ్మ, వెలివోలు రాంబాబు, బండ్రపల్లి సుబ్బారావు, కొడాలి. జ్యోతి, పసుమర్తి ధనుంజయుడు, కొల్లూరి ప్రసాద్, సత్యనారాయణ, తోట.సాంబశివరావు, వేములమడ. బసవ శంకరరావు, కూనపురెడ్డి శివపార్వతరావు, నిమ్మలూరి. వెంకటేశ్వరమ్మ, సుంకర. నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజులపాటి.శివాజీ, తూములూరి. కృష్ణ, ఉమామహేశ్వరరావు, రాయుడు, పూర్ణయ్య, రాయవరపు.నాగరాజు, జి కోటేశ్వరరావు, ఎస్. సామేలు, వి. గోపీచంద్, కే. బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



## మంటాడలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహణ

పమిడిముక్కల మేజర్ న్యూస్: మండల పరిధిలోని మంటాడ గ్రామంలో శు క్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 20 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిం చి, అవసరమైన వాటికి ఉచితంగా మం దులను అందజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ తమ సిబ్బందితో కలిసి ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా 150 గొర్రెలకు నట్టల నివారణ మందులు కూడా అందజేశారు. అలాగే పశువులకు అవసరమైన మినరల్ మిక్చర్ ను కూడా ఉచితంగా పంపిణీ చేశారు.

# కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోను వెంటనే అమలు చేయాలి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని కోర్టు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కె.నవీన్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్ దారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని వారు పేర్కొన్నారు. హామీల అమలులో తమ రాష్ట్ర సంఘం మూడు దశలలో వివిధ రకాలుగా పోరాటాలు చేయాలని నిర్ణయించిందన్నారు. మొదటి దశలో శుక్రవారం స్థానిక తహసిల్దారులకు వినతి పత్రాలు సమర్పణ, రెండవ దశలో ఫిబ్రవరి 10న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా, మూడో దశలో ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమాలను నిర్వహించాలని తలపెట్టినట్లు తెలిపారు. వెంటనే నూతన వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్దారులకు రావలసిన ఆర్థిక బకాయిలను పే స్లిప్ లో చూపించి వెంటనే చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు పింఛన్లు మరుసటి రోజు నుండి పింఛన్ సౌకర్యం కల్పించాలని, తమకు చెల్లించాల్సిన నాలుగు డిఎలను వెంటనే మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన రాతి పత్రాన్ని తహసిల్దార్ కు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్షులు దేవరపల్లి కోటయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాలీక్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఫికోల్, ఆర్థిక కార్యదర్శి కె.అనిల్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.ముతహర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి



### మహాత్మా గాంధీ స్ఫూర్తితోనే గాంధీ క్షేత్రం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ నిర్మాణ కార్యక్రమం స్ఫూర్తితోనే మండలి వెంకట కృష్ణారావు 1969లో మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా గాంధీ క్షేత్రం నిర్మించారని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ క్షేత్రంలో భారత స్వతంత్ర ఉద్యమ రథసారథి జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశ సమైక్యత, మాతృభాష, సంస్కృతి పరిరక్షణ, గాంధీ నిర్మాణ కార్యక్రమంలో భాగం అన్నారు. సత్యం అహింసతో యావత్ ప్రపంచాన్ని కదిలించిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని తెలిపారు. నోబెల్ అవార్డు గ్రహీత మార్టిన్ లూథర్ కింగ్ పోరాటానికి స్ఫూర్తి ప్రదాత గాంధీ అని తెలిపారు. దక్షిణ ఆఫ్రికాలో నెల్సన్ మండేలాకు, మారిషస్ స్వాతంత్ర పోరాటానికి మహాత్మా గాంధీ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. మహాత్మాగాంధీ అనుసరించిన సత్యాగ్రహం, అహింసాయుత పోరాట మార్గం గురించి నేటికీ అమెరికాలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని తెలిపారు.అనంతరం మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీ, మండలి అభిమానుల ఆధ్వర్యంలో వంతెన సెంటరులో మహాత్మా గాంధీ వర్ధంతి, ఎంవీ కృష్ణారావు శత జయంతి సందర్భంగా వారి విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరం ఆదినారాయణ, మాజీ ఎంపీపీలు బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, సొసైటీ చైర్మన్లు మాదివాడ రత్నారావు, యలవర్తి చిన్నా, యర్రంశెట్టి సుబ్బారావు, కూటమి నాయకులు బండే రాఘవ, దేగల రాఘవ, మెగావత్ గోపీ, మండలి రామ్మోహనరావు, గుగ్గిలం శ్యాంకుమార్, బషీర్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సత్యం, అహింసలే ఆయుధాలైన జాతిపిత మహాత్ముని జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని తెలుగు దేశం నాయకులు ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు.శుక్రవారం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మ గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొల్లూరి మాట్లాడుతూ సత్యం, అహింసలనే ఆయుధాలుగా మలుచుకుని దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిన మహనీయులు మహాత్మా గాంధీ... సత్యాగ్రహంతో, సహాయ నిరాకరణతో, అహింసా మార్గంలో నడిచి భారతీయులకు బానిసత్వం నుంచి విముక్తి కలిగించారని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ గాంధీయ మార్గంలో నడుచుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో లఖనం నాగాంజనేయులు, రావిర త్నగిరి, విశ్వనాథపల్లి పాప, మండలి రామ్మోహన్రావు, కొల్లూరు ఇమ్మాను యేల్, అవనిగడ్డ ప్రకాశం, బళ్ళ ప్రసాద్, మేడికొండ విజయ్, చెన్ను గురు మూర్తి, కొల్లూరి వాసు, నాగిడి రాంబాబు, పాటిబండ్ల నరేష్, మట్ట విజయప్ర సాద్, పాలెపు వెంకటేశ్వరరావు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

### గాంధీ క్షేత్రంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్** విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తెచ్చేందుకు ఈ ప్రతిభా పోటీలు ఎంతో ఉపకరిస్తాయని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు.శుక్రవారం జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ క్షేత్రంలో విద్యార్థులకు వివిధ అంశాలలో నిర్వహిం చిన పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. గ్రామీణ యువజన వికాస సమితి, గాంధీ క్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిభా పాటవ పోటీలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గాంధేయ జీవన దృక్పథం అంశంపై డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆర్.వెంకట్, ఎన్.సాయి, క్రాంతి కాలేజ్ విద్యార్థిని సీహెచ్.బాల మహి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. గాంధీజీ ఆశించిన స్వతంత్ర భారతం అంశంపై వక్తృత్వ పోటీల్లో పులిగడ్డ ఏపీఆర్ఎస్ విద్యార్థి విస్సంశెట్టి రోహిత్ నాగలక్ష్మణ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కొక్కిలిగడ్డ జవనేశ్వరి, క్రాంతి కాలేజీ విద్యార్థిని యాసం ఆశ్విత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. స్వచ్ఛ గ్రామం అంశంపై చిత్రలేఖనం పోటీలలో ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి పీ.కృష్ణకుమార్, ఏపీఆర్ ఎస్ విద్యార్థి ఎన్.లోకేష్, అశ్వారావుపాలెం విద్యార్థిని బాలసాత్విక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మరో ఇద్దరు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విజేతలకు నగదు బహుమతులు, గాంధీ చిన్న కథలు పుస్తకాలు, ప్రశంసా పత్రాలు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన న్యాయ నిర్ణేతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులను సత్కరించారు. న్యాయ నిర్ణేతలుగా గుడిసేవ విష్ణుప్రసాద్, కూనపరెడ్డి చంద్రశేఖర్, తుంగల రంగాజీ, సీహెచ్.వినుకొండ, పి.ఆంజనేయ దాసు వ్యవహరించారు.



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీలో గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీకి ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులు అర్పించటం జరిగింది. ఈ సంద ర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం లో అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు. పోతురాజు థామస్ పాల్, ఉప్పుతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై నిరసన



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఐనంపూడి గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని, పేరు మార్చే చట్టాన్ని, పథకం మార్చే విధానానికి నిరసనగా శుక్రవారం ఉపాధి కూలీలు గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అయినంపూడి వెంకటేశ్వరరావు, ఉపాధి పథకం మేట్ లు ఎం.లక్ష్మి, అంబటి లక్ష్మి, దగాని వెంకటసుబ్బమ్మ, పిల్లి శేఖర్, కె.మరియమ్మ, అంబటి బేబి తదితరులు పాల్గొన్నారు.

### స్పర్శ కార్యక్రమం నిర్వహణపై అవగాహన ప్రతిజ్ఞ



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** ప్రపంచ కుష్టి వ్యాధి నిర్మూలనలో భాగంగా స్పర్శ ప్రోగ్రాం శుక్రవారం నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరుగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహ సిల్దార్ కె.నవీన్ కుమార్, ఎండిఓ వీర్ల సీతారామారాజు, వైద్యాధికారులు డాక్టర్ ఎం. బాలాజీ, డాక్టర్ కె.అఖిల పాల్గొని స్పర్శ కార్యక్రమం పై అవగాహ న కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమము15 రోజుల పాటు మండల పరిధిలో గల కపిలేశ్వరపురం, పమిడిముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటరీల తో నిర్వ హించనున్నట్లు తెలిపారు. తమ శరీరంపై మచ్చలు ఉన్న వారు ఈ స్పర్శ కార్యక్రమములో పాల్గొని వైద్య సిబ్బందికి సహకరించవలసిందిగా కోరారు.

### పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చేయూత



**జి కొండూరు మేజర్ న్యూస్ :** పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చే యూతనిస్తూ ముఖ్య మంత్రి సహాయనిధి నుం చి వెంటనే ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పలువురికి మెరుగైన వైద్యసేవల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లు మంజూరయ్యాయి. వీటిని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం అందజేశారు. జి.కొండూరుకు చెందిన షణ్ముగం సురేష్ కు రూ.65వేలు, మైలవరం మండలం వెల్వడంకు చెందిన పొదిలి వీరాస్వామికి రూ.87లు, ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండకు చెందిన చింతల అజయ్ కుమార్ కు రూ.1 లక్ష, విజయవాడ రూరల్ మండలంలోని రాయనపాడు గ్రామానికి చెందిన ఎం.మోక్షరోన్ కు రూ.2 లక్షలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన ఎల్.ఓ.సీలను అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అనారోగ్య బాధితులు వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర యాజమాన్య ఎరువులపై అవగాహన



**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, వేములపల్లి లో కే.వీ.కే శాస్త్రవేత్త డా. యం.వెంకట లక్ష్మీ వివిధ పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం పై అవగాహన వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. రసాయన ఎరువుల, పచ్చి రొట్ట, సేంద్రీయ, జీవన ఎరువులు వినియోగించు విధానాన్నీ రైతులకు వివరించారు. సస్యపోక్షణ శాస్త్రవేత్త డా. వెంకట లక్ష్మీ మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులు, పశువుల ఎరువు వేయడం వలన నేలలో సేంద్రీయ కార్బనం శాతం పెరుగుతుందని. జీవన ఎరువులు వివిధ పంటలలో తక్కువ ఖర్చుతో వరి, మినుము, కూరగాయ మొక్కలకు, పంటలకు వినియోగించు కోవచ్చునని తద్వారా నేలలో సుష్మజీవుల సంఖ్య పెరుగుతాయని, నేలలో ఉన్న పోషకాలు కరిగి మొక్కలకు పోషకాలు అందించడం, భూమి సారవంతం పెరగడం జరుగుతుందన్నారు. రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేత

**హనుమాన్ జంక్షన్, జనవరి 30, మేజర్ న్యూస్ :** 33 కేవీ కానుమోలు నుంచి ఆరుగొలను సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ లైన్లలో మరమ్మత్తుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం (31-01-2026) ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మరమ్మత్తుల కారణంగా ఆరుగొలను, ఓగిరాల, చిరివాడ, తిప్పనగుంట, అప్పారావుపేట, కాకులపాడు, వి.ఎల్.పురం, రామన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి. శ్రీనివాసరావు కోరారు.

## గ్రూప్2 సాధించిన సాయి ప్రియ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ ఇనకుదురుపేట ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సాయి ప్రియ గ్రూపు2 లో విజయం సాధించింది.ఆమె సాధారణ పరిపాలన విభాగం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా గ్రూప్ 2లో ఎంపికయింది. గ్రూప్-2కు ఎంపికైన ఉపాధ్యాయురాలు కు మచిలీపట్నం ఎంఈఓ దుర్గాప్రసాద్ అభినందనలు తెలియజేశారు. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలు సాయి ప్రియ గ్రూప్-2 విజయం సాధించటం తో కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.ఒకవైపు ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం చేస్తూ ఖాళీ సమయంలో గ్రూప్-2కి సంసిద్ధమవుతూ, 2026 గ్రూప్ 2 ఉద్యోగ ఫలితాలలో నాన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్ 2 లో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని, ఆయన ప్రోత్సాహంతోనే గ్రూప్-2లో విజయం సాధించానన్నారు. గతంలో 2021 ఏపీపీఎస్సీ గ్రూప్ 4 లో విజయం సాధించి గన్నవరం తాసిల్దార్ ఆఫీస్ లో జూనియర్ అసిస్టెంట్ గా, అలానే 2025లో మెగా డీఎస్సీలో ఉపాధ్యాయురాలుగా ఎంపికైనట్లు తెలిపారు.దీనితో మచిలీపట్నం కార్పొరేషన్ పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

## మానవతవాది దుర్గారావు హఠాన్మరణం

### ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాల దానం





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు ప్రాంతంలో కులమతాలకు అతీతంగా మృతి చెందిన వారి పార్థివదేహాల దహన సంస్కారాలకు ఉచిత సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందిన గుంప దుర్గారావు ఆకస్మిక మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఆయన గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. పామర్రు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొనేవారు. ఆయన మృతి పట్ల మానవత సంస్థ ప్రతినిధులు తమ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను విజయవాడ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందించేందుకు సమాచారం అందించగా, శుక్రవారం ఆసుపత్రి సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరించారు. అనంతరం నేత్ర దానానికి సంబంధించిన ధృవపత్రాన్ని ఆసుపత్రి సిబ్బంది దుర్గారావు కుమారునికి అందజేశారు.

## వేములపల్లి రాంబాబు హఠాన్మరణం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** శ్రీరామ ట్రేడర్స్ అధినేత,ఎరువుల కొట్టు రాంబాబు గా ఈ ప్రాంత రైతాంగానికి, ప్రజానికానికి చిరపరిచితమైన వేములపల్లి రాంబాబు హఠాన్మరణం చెందారు.శుక్రవారం మధ్యాహ్నం కార్డియాక్ అరెస్టయి అస్వస్థతకు గురికావడంతో వెంటనే కుటుంబ సభ్యులు హాస్పిటల్ కు తరలించారు.రాంబాబును పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.రాంబాబు భౌతిక కాయాన్ని బంధు,మిత్రుల సందర్శనార్థం చల్లపల్లి విజయ నగర్ లోని ఆయన స్వగృహం వద్ద ఉంచారు.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.రాంబాబు హఠాన్మరణం చెందారన్న సమాచారం తెలుసుకున్న అధికార, అనధికార ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు రాంబాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. శనివారం ఉదయం రాంబాబు భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలను వెంటనే సానుకూలంగా పరిష్కరించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉద్యోగుల సమస్యలను వెంటనే సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, సంబంధిత అధికారులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తావించిన పలు సమస్యలను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గుడివాడ ఉప ఖజానా కార్యాలయంలో సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్ కు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ తెగల పిల్లలకు ఆధార్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, మండల విద్యాధికారులందరూ వారి పరిధిలో ఎంత మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు కావాలో వివరాలు సేకరించి అందజేయాలన్నారు. వారికి ఆధార కార్డులు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని డిటిడబ్ల్యు ఫణి ధూర్జటికి సూచించారు.పదవి విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు చెల్లింపులు ఆలస్యం అవుతుందని బిల్లుల స్థితిగతులు కూడా తెలియడం లేదని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తావించగా ఈ విషయమై జిల్లా కలెక్టర్ జిజిహెచ్ పర్యవేక్షకులు ఆశాలత నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మొత్తం 300 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించడానికి సమయం పడుతుందని, చాలా వరకు అర్హత లేని వారు దరఖాస్తు చేస్తున్నారని చెప్పగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించి మెడికల్ బిల్లుల చెల్లింపు పరిస్థితిపై సమీక్షించి త్వరితగతిన బిల్లులు చెల్లించే విధంగా పరిష్కార మార్గం చూపాలనీ సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ కు సూచించారు.గ్రామ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు బయోమెట్రిక్ హాజరు ఎక్కడైనా వేసుకునే అవకాశం కల్పించాలని కోరగా జిల్లా కలెక్టర్ అందుకు అంగీకరిస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్వో పదవులు భర్తీ చేయాలని, అర్హులైన గ్రేడ్ 2 వీఆర్వోలకు గ్రేడ్ వన్ వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, అర్హులైన గ్రేడ్ వన్ వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.వీఆర్ఏల జీతాలు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నారని నిర్వహించిన విధులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు వీఆర్వోలు త్వరగా అందజేసి బిల్లులు క్లెయిమ్ చేయాలన్నారు. పలు సందర్భాల్లో పాఠశాలలను సందర్శించినప్పుడు ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు గణితంలో విద్యాబోధన అర్థమయ్యే రీతిలో చెప్పడం లేదన్నారు. కనీసం కూడికలు, తీసివేతలు, భాగాహారాలు కొంతమంది విద్యార్థులు సరిగా అర్థం కాక కొన్ని ఇబ్బందులతో చేయలేకపోతున్నట్లు ఇటీవల గమనించానన్నారు. లెక్కలు సరిగా చేయని ప్రతి విద్యార్థి దగ్గర కూర్చుని వారు ఎందుకు చేయలేకపోతున్నారు లోటుపాట్లను గమనించి వారి తప్పులను సరిదిద్ది సరైన మార్గం చూపేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలకు సూచించారు. ఈ సమావేశంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి శ్రీదేవి,జిల్లా పరిషత్ డిప్యూటీ సీఎం ఆనందకుమార్, గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, జిజిహెచ్ పర్యవేక్షకులు డాక్టర్ ఆశాలత, జిల్లా ఖజానా అధికారి రవికుమార్ తదితర అధికారులు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గోదావరి కృష్ణా కో-అపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ జీవన్ వెంకట్రావు




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** గోదావరి కృష్ణా కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందుతూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని సొసైటీ చైర్మన్ జీవన్ వెంకట్రావు మేడూరి తెలిపారు. శుక్రవారం చల్లపల్లిలోని బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2024 జనవరిలో చల్లపల్లిలో ప్రారంభమైన తమ శాఖ రెండేళ్ల ప్రయాణంలోనే ప్రజల నుండి మంచి ఆదరణ పొందిందన్నారు. అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాల నుండి సుమారు 2,000 మంది సభ్యులుగా చేరారని, ప్రస్తుతం చల్లపల్లి బ్రాంచ్ పరిధిలో రూ. 7 కోట్ల డిపాజిట్లు సేకరించగా, సభ్యుల అవసరాల నిమిత్తం రూ. 4 కోట్ల మేర రుణాలు అందజేశామని వివరించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా "నారీ సంకల్ప్" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి 250 మంది మహిళలకు రుణాలు మంజూరు చేశామని, అలాగే "జీకే భవిష్య"పథకం ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 23 బ్రాంచ్‌లను ఏర్పాటు చేశామని, మొత్తం 18,000 మంది సభ్యులు, రూ. 120 కోట్ల డిపాజిట్లు, రూ. 90 కోట్ల రుణాలతో సంస్థ విజయవంతంగా నడుస్తోందన్నారు. సంస్థ ప్రగతిలో 170 మంది ఏజెంట్లు, 250 మంది ఉద్యోగుల కృషి ఎంతో ఉందని కొనియాడారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం మొత్తం తమ శాఖలను విస్తరించే యోచనలో ఉన్నామని, త్వరలోనే చిరు వ్యాపారులకు అండగా నిలిచేందుకు జీకే"ఉజ్వల లోన్ "పథకాన్ని ప్రారంభించి ఆర్థిక చేయూతనిస్తామని చైర్మన్ జీవన్ వెంకట్రావు మేడూరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ రీజినల్ హెడ్ శివరామ కృష్ణ, ఎన్టీఆర్ రీజినల్ హెడ్ వెంకటేష్, వర్టికల్ హెడ్ నిరీక్షణ్, క్లస్టర్ హెడ్ ఆంజనేయులు, చల్లపల్లి బ్రాంచ్ మేనేజర్ కిషోర్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు



## కుంటమొక్కలలో మెగా ఉచిత పశు వైద్య శిబిరం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని కుంటముక్కల గ్రామంలో శుక్రవారం పశువుల హాస్పిటల్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో క్యాంప్ నిర్వహించి పశు వైద్యులు శ్రీకాంత్ శువులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యులు శ్రీకాంత్ జి కొండూరు మండల పార్టీ సెక్రటరీ వంక నాగేశ్వరావు పిఎసిఎస్ చైర్మన్ సుఖవా శ్రీహరి జయలక్ష్మి నీటి సంఘం అధ్యక్షులు కొమ్మవరపు వెంకటేశ్వరరావు గోల శ్రీనివాసరావు మహేష్ పాల్గొన్నారు.

# గురు రత్న అవార్డు పొందిన అధ్యాపకులు హరనాధ్‌కు సన్మానం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా మచిలీపట్నంలో గల చారిత్రక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు లంకిశెట్టి కుసుమ హరినాథ్ బాబుకు గురు రత్న అవార్డు లభించింది.మద్రాస్ లో ఎ.యం.ఇ టీ యూనివర్సిటీ అందించిన ఈ అవార్డును ఈ నెల 25న రిపబ్లిక్ డే సందర్భంగా అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం లేడీ యాంప్తిల్ కళాశాలలో హరినాథ్ బాబుకు ఘన సన్మానం జరిగింది. కళాశాల అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు,ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ఇంటర్మీడియట్ బోర్డ్ మాజీ డివైఈవో మట్ట రాధా కృష్ణా, రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీల రావు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లంకెశెట్టి నీరజ జోడుగుళ్ల చైర్మన్ దేవనూరి వీరబాబు, లేడి యాంప్తిల్ కళాశాల అధ్యాపకులు,విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైబడి లేడీ యాంప్తిల్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు హరినాథ్ బాబు అధ్యాపక వృత్తితోపాటు సోషల్ యాక్టివిటీస్ లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఫలితంగానే ఆయనకు గురురత్న టీచర్స్ అవార్డు లభించింది అన్నారు.దేశవ్యాప్తంగా వంద మందికి ఈ అవార్డు లభించగా సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకుని హరినాథ్ బాబుకు గురు రత్న అవార్డు లభించడం హర్షణీయమన్నారు. అధ్యాపక వృత్తికే వన్నె తెచ్చే విధంగా కుసుమ హరినాథ్ బాబు గత 25సంవత్సరాలుగా బంటుమిల్లి మచిలీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొన్ని వందల మంది పేద విద్యార్థులు ఫీజులు యూనిఫారం ఇతర కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి వారు జీవితంలో స్థిరపడడానికి ఎంతగానో కృషి చేశారని సాయన సుశీల రావు, మట్ట రాధాకృష్ణ అన్నారు. పదవికే వన్ని తెచ్చే విధంగా హరినాథ్ బాబు తన పదవి బాధ్యతలను కొనసాగిస్తున్నారని మోటామర్రి బాబా ప్రసాదు అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా సేవలు జాతి స్థాయిలో గుర్తింపు రావడం మచిలీపట్నానికి గర్వకారణం అని జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు అన్నారు.తమ కళాశాలలో అన్ని విధాలుగా అభివృద్ధికి ముందుండి నడిపించే హరినాథ్ బాబు తమ కళాశాలలో ఫాదర్ ఆఫ్ ది తెరిసా అని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సుందర లక్ష్మి అన్నారు. అనంతరం జనవరి 26న కృష్ణా జిల్లా కలెక్టర్ వచ్చే ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన ముగ్గురు అధ్యాపకులను కూడా సన్మానించారు.

# నగరంలో శ్రీ చిదంబరం గారు చిత్ర యూనిట్ సందడి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** నగరంలో శ్రీ చిదంబరం గారు చిత్ర యూనిట్ సందడి చేసింది. మెల్లకన్ను ఉన్న ఒక యువకుడు సమాజంలో ఎదుర్కొనే అవమానాలు ఇతి వృత్తంగా తీసుకుని తీసిన చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో వంశీ తుమ్మల కోరారు. శ్రీ చిదంబరం గారు చిత్రం ప్రమోషన్ లో భాగంగా గురునానక్ కాలనీ లోనీ ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో వంశీ తుమ్మల మాట్లాడారు. సాధారణంగా సినిమాల్లో శారీరక లోపాలను కేవలం హాస్యం కోసమే వాడుకుంటారు కానీ ఈ చిత్రంలో మెల్లకన్ను ఉన్న ఒక యువకుడు సమాజంలో ఎదుర్కొనే అవమానాలు, అతనిలో ఉండే ఇన్సెక్యూరిటీలు, అతని భావోద్వేగపూరితమైన ప్రేమకథను దర్శకుడు వినయ్ రత్నం చాలా హృద్యంగా ఆవిష్కరించారన్నారు. చిత్రం ట్రైలర్‌ను 'ఉప్పెన', 'పెద్ది' చిత్రాల దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారని ఇప్పటికే ట్రైలర్ కు విశేష స్పందన లభిస్తోందన్నారు. చందు రవి సంగీతం అందించిన ఈ సినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి గ ఒక పాట పాడటం సంతోషంగా ఉందన్నారు "నీ లోపం నీకు బలహీనత కాకూడదు, అది నీ బలం అవ్వాలి" అనే చక్కని సందేశంతో వస్తున్న ఈ గ్రామీణ ప్రేమకథ ఫిబ్రవరి 6 ప్రేక్షకుల ముందుకు రాబోతుందనీ ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. అనంతరం హీరోయిన్ సంధ్య వశిష్ట మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయే నేటి యువతకు తమ లోపాన్నే బలంగా మార్చుకోవాలని చెప్పే ఒక నిజాయితీ గల స్ఫూర్తిదాయకమైన ప్రయత్నమనే శ్రీ చిదంబరం గారు చిత్రం అని అన్నారు. దర్శకుడు వినయ్ రత్నం మాట్లాడుతూ ఫిబ్రవరి 6వ తేదీన తమ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ఈ సమావేశంలో చిత్ర నటుడు గోపి పాల్గొన్నారు.

# యువ మహిళా క్రికెటర్లకు హిమాలయ తోడ్పాటు

## 1డెర్‌వుమన్ అకాడమీతో ముందడుగు




**విజయవాడ, మేజర్ న్యూస్ :** యువతులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి తమకు ఇష్టమైన రంగాలలో విజేతలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'హిమాలయ వెల్‌నెస్' ముందడుగు వేసింది. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని '1డెర్‌వుమన్ అకాడమీ'ని ప్రారంభించింది. ఈ అకాడమీ ద్వారా యువ మహిళా క్రికెట్ ఆశావహులను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మహిళా జట్టు ఆటగాళ్లతో మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. వంద మందికి స్కాలర్‌షిప్‌లను కూడా అందించనుంది. క్రికెట్‌కు సంబంధించిన విలువైన సూచనలు, మార్గనిర్దేశం ఒక ఇంటరాక్టివ్ చాట్‌బాట్ రూపంలో అందిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అకాడమీ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్స్ అందించనున్నారు. తుది అసైన్‌మెంట్‌నే స్కాలర్‌షిప్ దరఖాస్తుగా పరిగణించనున్నారు. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ కంపెనీ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డివిజన్ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణమూర్తి మాట్లాడుతూ హిమాలయలో చేపట్టే ప్రతి కార్యక్రమం స్పష్టమైన ఫలితాలు అందించే లక్ష్యంతో రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ అకాడమీ ద్వారా యువతులలో విద్య, ఆత్మవిశ్వాసం, దీర్ఘకాలిక అభివృద్ధికి మద్దతుగా నిలిచే వ్యవస్థాత్మక మార్గాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెటింగ్ డైరెక్టర్ రాగిణి హరిహరన్ మాట్లాడుతూ బాలికలు తమ సొంత ప్రయాణాల్లోనూ మద్దతు పొందాలన్న ఉద్దేశంతో ఈ అకాడమీని ప్రారంభించామన్నారు. ఈ అకాడమీ ద్వారా సాంకేతికతను విశ్వసనీయతతో మిళితం చేస్తూ ఈ తరం యువతకు మార్గనిర్దేశం అందేలా చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ బ్యూటీ, ఫేస్ కేర్ జనరల్ మేనేజర్ అభిషేక్ ఆశత్ మాట్లాడుతూ ఈ అకాడమీ కేవలం అవగాహన కల్పించడానికే పరిమితం కాదన్నారు. మార్గనిర్దేశంతో కూడిన ఇంటరాక్షన్లు, వనరులు, స్కాలర్‌షిప్‌లతో జీవితంలోని కీలక దశలో ఉన్న బాలికలకు మద్దతుగా నిలవడమే మా లక్ష్యమన్నారు. హిమాలయకు వెల్‌నెస్ అంటే కేవలం ఉత్పత్తులకే పరిమితం కాదన్నారు. ఆత్మవిశ్వాసం, సామర్థ్యం, దీర్ఘకాలిక ప్రభావాన్ని పెంపొందించడం అన్నారు. డిజిటల్ వేదికకే పరిమితం కాకుండా ఫీమేల్ క్రికెట్ అకాడమీతో కలిసి ఒక ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామన్నారు. ఈ టోర్నమెంట్‌కు 200కు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 25 మంది యువ బాలికలు ఆర్సీబీ జట్టును ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందారన్నారు. మహిళా క్రికెట్ దేశవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న ఈ సమయంలో 1డెర్‌వుమన్ అకాడమీ యువ బాలికలు చరిత్రను కేవలం చూడటానికే కాకుండా, ఆ చరిత్రలో భాగస్వాములయ్యే అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. నమోదు కోసం.. https://onederwoman.onrender.com/chat
మరింత సమాచారం కోసం.. https://onederwoman.onrender.com/

# మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై జగన్ వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ బీసీ నేతలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, వెనుకబడిన వర్గాల యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన అనుచిత, హేళన పూర్వక వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ బీసీ నేతలు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకపోయినా జగన్ నైజం మారలేదని, బీసీ నాయకులు ఎదుగుతుంటే చూసి ఓర్వలేకనే ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వారు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి, కృష్ణా జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ పై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలపై జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని.సంక్రాంతి పండుగ సందర్భంగా మంత్రి సుభాష్ సొంత నియోజకవర్గంలో మూడు రోజుల కోనసీమ ఉత్సవం ఘనంగా నిర్వహించారని, ఈ ఉత్సవాల్లో పాల్గొన్న జబర్దస్త్ టీమ్ సభ్యుడు శాంతి స్వరూప్ ఇతర కళాకారుల విజ్ఞప్తి మేరకు, మంత్రి సుభాష్ కేవలం ఒక్క నిమిషం పాటు వారితో కలిసి వేదికపై సందడి చేశారని అన్నారు. మంత్రి "అశ్లీల డాన్సులు" వేశారని జగన్ మోహన్ రెడ్డి విమర్శించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. ఒక మగ కళాకారుడు (శాంతి స్వరూప్) చీర కట్టుకుని ప్రదర్శన ఇస్తుంటే, అది కూడా తెలియకుండా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు.గత ప్రభుత్వంలో మంత్రి అంబటి రాంబాబు వేసిన డాన్సులను జగన్ మోహన్ రెడ్డి ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. తిరుపతి లడ్డు వివాదం వంటి కీలక అంశాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకే జగన్ ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు లకనం నాగాంజనేయులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి బీసీ నాయకుల పట్ల అనుసరిస్తున్న తీరును, వారిపై చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు.ఆయన మాటలు సమస్త బీసీ వర్గాలను అవమానపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో బీసీ ప్రజాప్రతినిధులను తన ఇంటి బయటే నిలబెట్టి, వారిని సరైన రీతిలో గౌరవించలేదని గుర్తు చేశారు.బీసీలను చిన్నచూపు చూసే జగన్మోహన్ రెడ్డికి లేదా వైసీపీ నేతలకు బీసీ నాయకులను విమర్శించే కనీస నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రావి రత్నగిరి, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అవనిగడ్డ ప్రకాశం, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి ఇమ్మానియేలు,నాగాయితిప్ప పీఏసీఎస్ అధ్యక్షుడు బళ్ల ప్రసాద్ పార్టీ నాయకులు మేడికొండ విజయ్, మండలి రామమోహన రావు,విశ్వనాథపల్లి పాప,చెన్ను గాంధీ,గురుమూర్తి,బాపూజీ,పాటిబండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల నివారణకు చర్యలు చేపట్టండి



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో కోతులు గత రెండు సంవత్సరాల నుంచి ప్రజలకు, రైతులకు, గృహస్థులకు తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ విషయమై గత సంవత్సరం పంచాయతీ సచివాలయం వద్ద ధర్నా చేసి సిపిఎం గ్రామ శాఖ, గ్రామస్తులు సంయుక్తంగా వినతి పత్రం సమర్పించడం జరిగిశీదని, జిల్లా కలెక్టర్ గ్రామ సందర్శనకు వచ్చినప్పుడు వినతిపత్రం సమర్పించడం జరిగిశీది. పంచాయతీ వారు కొండముచ్చును కొనుగోలు చేసి కోతుల నివారణకు ప్రయత్నాలు చేసినారు కానీ కొండ ముచ్చిని కుక్కలు కరిచడంతో చనిపోవడం జరిగింది. ఆ తర్వాత గ్రామంలో జన సైనికులు తోడ్పాటుతో పెద్దల నుంచి విరాళాలు వసూలు చేసి మరో కొండముచ్చును మూడు నెలల క్రితం కొనుగోలు చేసి పంచాయతీ అధికారులకు అప్పచెప్పటం జరిగిశీది. గ్రామంలో ఉన్న కొండముచ్చును నాలుగు గోడల మధ్య ఉంచుతున్నారే తప్ప కోతులను గ్రామం నుంచి పారదోలడానికి పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో కోతులు గ్రామంలో విచ్చలవిడిగా వీర విహారం చేస్తున్నాయి. అధికారులు పట్టించుకుని కొండముచ్చును గ్రామం మొత్తం తిప్పి కోతులను వెంటనే గ్రామం నుంచి పారదోలి రైతులకు,గృహస్థులకు,ప్రజలకు, పిల్లలకు ఇబ్బందులు లేకుండా చేయాలని,త్వరలో రైతులకు మినుము పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమవుతున్న తరుణంలో కోతులను గ్రామం నుంచి తరిమి వేయకపోతే పంటను నష్టపరిచే పరిస్థితి ఉందని,కోతులు బెడదను నివారించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి సచివాలయం వద్ద ధర్నాకు పూలునుకోవాల్సివస్తుందని మండల కార్యదర్శి శీలం.నారాయణరావు, గ్రామ శాఖ కార్యదర్శి మాదాసు.నాగులు, పార్టీ సభ్యులు దేవరపల్లి.మణి హెచ్చరించారు.

## అసత్య ప్రచారాలు మానుకోండి.. మాపై ఎందుకు వివక్ష.



**జి కొండూరు మేజర్ న్యూస్ :** సమాజంలోని కొందరు వ్యక్తులు మేము చేసే సేవా కార్యక్రమాలు చూసి సహించలేక వివిధ మార్గాలలో ను, సాధనాల ద్వారా అసత్య ఆరోపణలు ప్రచారాలు, సోషల్ మీడియాలో గత ఐదు రోజుల నుండి ప్రసారం చేస్తున్నారని ఇది సరైన విధానం కాదని కొండూరు శ్యామల(హిజ్రా), ఎల్ విజయలక్ష్మిలు. ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరు లతో మాట్లాడారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన కొండూరు శ్యామల విజయలక్ష్మి లు తమపై వచ్చే విమర్శలు ఆరోపణలను ఖండించారు. తాము నిరంతరం గుంటూరు,ఎన్టీఆర్,కృష్ణా జిల్లాలలో పలు సేవా కార్యక్రమాలు మానవతా దృక్పథంతో పేదలకు, విద్యార్థులకు, వృద్ధులకు చేస్తున్నామని కానీ కొందరు తమ ఎదుగుదలను చూసి ఓర్వలేక, వివక్షత చూపుతూ తాడేపల్లిగూడెం చెందిన రాజు, పెనుమాక కు చెందిన రోశయ్యలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అలాగే సదరు వ్యక్తులు పలు చోట్ల అశాంతిని కలగజేసి తమపై ఆపాదిస్తున్నారని వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకొనేలా ప్రభుత్వ అధికారులను ఫిర్యాదు చేయనున్నట్లు శ్యామల విజయలక్ష్మిలు విలేకరులు తెలిపారు.

## ఎస్ఐ వెలుగుల సురేష్‌కు ఆర్యవైశ్య సంగం ఘన సత్కారం

**హనుమాన్ జంక్షన్, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలంలోనే ప్రజల మన్ననలు పొందుతూ ఉత్తమ పోలీస్ అధికారిగా గుర్తింపు సాధించారని ఆర్యవైశ్య నాయకులు పైడి సుధాకర్, కొనకళ్ళ రాజశేఖర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో పనిచేసినందుకే ప్రభుత్వం అధికారికంగా ఆయన్ను గుర్తించిందని వారు అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో, విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నందుకు ఎస్ఐ వెలుగుల సురేష్‌కు జిల్లా కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్ ఆర్యవైశ్య సంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఐ వెలుగుల సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులందరూ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని, చిరకాలం గుర్తుండిపోయేలా జ్ఞాపికను అందజేసి తమ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంగం నాయకులు తవ్వా పూర్ణ చంద్రరావు, చామర్తి రాంబాబు, బొమ్మిశెట్టి రామారావు, కాళీ వరప్రసాద్, మిట్టపల్లి పద్మలలిత, కపిలవాయి భగవతి, చలువాది రాజ్యలక్ష్మి, నార్కిడమిల్లి ప్రసాద్, వెచ్చా వెంకటేశ్వరరావు, చామర్తి లోకనాథ్, గార్లపాటి రామకృష్ణ, గార్లపాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు మంజూరు చేసి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో వేగంగా అనుమతులు మంజూరు చేసి విరివిగా పరిశ్రమలు నెలకొల్పుటకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశము నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నం లో జరిగిన భాగస్వాముల సదస్సు లో భాగంగా భారీ పరిశ్రమలు నెలకొల్పుటకు ఒప్పందాలు చేసుకొని ముందుకు వచ్చిన 10 కంపెనీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వేగంగా వ్యాపార అనుమతులు (స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్) మంజూరు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారని తద్వారా వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో సింగిల్ డెస్క్ పాలసీ కింద 1491 దరఖాస్తులు అందగా ఇప్పటివరకు 1471 దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు ఇంకను మిగిలిన 20 దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలించి సత్వరమే అనుమతులు మంజూరు చేయుటకు చొరవ చూపాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద 2051 యొక్క దరఖాస్తులను రుణాలు మంజూరుకు బ్యాంకులకు పంపామని వాటిలో 873 దరఖాస్తులకు సంబంధించి యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

మిగిలిన యూనిట్లు కూడా త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి హామీ కార్యక్రమం కింద 213 దరఖా స్తులు బ్యాంకులకు పంపగా అందులో 134 యూనిట్లు నెలకొల్పారన్నారు. ఎం ఎస్ ఎం ఈ క్లెయిముల కింద 3 దరఖాస్తులకు సంబంధించి 89.50 లక్షల రూపాయల పెట్టుబడి రాయితీ, స్టాంపు డ్యూటీ తిరిగి చెల్లింపు రాయితీలు జిల్లా కలెక్టర్ మంజూరు చేస్తూ ఉత్తరుడు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వెంకటరావు, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ బాబ్జి, ఎల్డియం రవీంద్రారెడ్డి, డి టి డబ్ల్యూ ఓ ఫణి ధూర్జటి, జిల్లా రిజిస్ట్రార్ గోపాలకృష్ణ తదితర అధికారులు, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీజీ చిరస్మరణీయులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహాత్మా గాంధీజీ చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి - అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ మూల సిద్ధాంతాలు సత్యం అహింస అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలు సైతం ధారపోసిన మహనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, కె ఆర్ ఆర్ సి. ఎస్ డి సి శ్రీదేవి, జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనందకుమార్, గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ ఉపాధ్యక్షుడిగా విక్టర్ పాల్



**మొవ్వ మేజర్ న్యూస్:** ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ ఉపాధ్యక్షుడుగా మండల పరిధిలోని పెదముత్తేవి గ్రామానికి చెందిన నడా. విక్టర్ పాల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం ఫర్ ఆర్టిఐ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రమోహన్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు విక్టర్ పాల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణే ద్యేయంగా ఫోరం ఫర్ ఆర్టిఐ పనిచేస్తుం ద న్నారు. ప్రజలకు చట్టాలు పట్ల అవగాహనతో పాటు సమాజంలో జరుగు తున్న అవినీతిని నిరోధించేందుకు ఫోరం ఫర్బ ఆర్టీఐ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడకుండా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్టిఐ కార్యకర్తలకు రక్షణ చట్టం విక్టర్ పాల్ ఉంద న్నారు. ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షులు మట్టా. ప్రసాద్, జిల్లా అధ్యక్షు లు పోలన. అశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కాకి. రాజశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షులు దోనెపూడి. శిరీష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి. రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఓరుగంటి శ్రీను, చిగురుపల్లి సుబ్ర హ్మణ్యం, డొక్కు. వెంకట్, ఘంటసాల మండల అధ్యక్షులు చందుల. జైపాల్, జిల్లా కార్యదర్శి తెనాలి, బాలశౌరి లకు పాల్ కృతజ్ఞతలు తెలిపారు.

# గన్నవరం నియోజకవర్గ అభివృద్ధియే ధ్యేయం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, జనవరి 30, మేజర్ న్యూస్ :** గన్నవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పి4 పథకం కింద హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కుట్టు మిషన్లు, నైపుణ్య ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ ఎంతో దోహదపడుతుందని అన్నారు. సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంస్థలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో హెచ్‌సీఎల్ సామాజిక బాధ్యత నిధులను గన్నవరానికి కాకుండా ఇతర నియోజకవర్గాలకు మళ్లించారని ఆరోపించారు. స్థానిక నిధులను స్థానిక అభివృద్ధికి వినియోగించడంలో అప్పటి ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని మండిపడ్డారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దర్బార్ అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్యటనల్లో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పేదలకు ఇళ్ల పట్టాల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం కావాలని, ఆ తర్వాత పార్టీలకు అతీతంగా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు.

## ఎసీబీ వలలో పడ్డ సచివాలయం విలేజ్ సర్వేయర్



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** 14వేలు లంచం తీసుకుంటూ ఎసీబీకి పట్టుబడ్డ వాడపాలెం సచివాలయ విలేజ్ సర్వేయర్ సుంకర రాజేష్ మూడు స్థంభాల సెంటర్ లో నడిరోడ్డుపై బహిరంగంగా లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఎసీబీ డీఎస్పీ పెదయాదర గ్రామంలో 3.76 ఎకరాల వ్యవసాయ భూమి సర్వే చేసేందుకు లంచం డిమాండ్ చేసిన రాజేష్, బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామన్న డీఎస్పీ ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిర్మూలనే లక్ష్యంగా ఎసీబీ పని చేస్తోందన్న డీఎస్పీ, ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే తక్షణమే మా దృష్టికి తీసుకురావాలని ఎసీబీ డీఎస్పీ సుబ్బారావు కోరారు.



## హిందూ స్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నియోజకవర్గం జి.కొండూరు మండల కేంద్రం లోని హిందూ స్మశాన వాటికలో దహన సంస్కారాలు చేయడానికి కుడా వీలు లేకుండా ఉండగా మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సూచనలతో మైలవరం నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్, జి.కొండూరు గ్రామ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు పజ్జూరు వెంకటేశ్వరరావు (బుల్లి) పర్యవేక్షణలో జంగిల్ క్లియరెన్స్ పనులు నేటి మధ్యాహ్నం నుచి ప్రారంభం అయ్యాయి ఈ కార్యక్రమం లో పజ్జురు జగన్, యూనిట్ ఇంచార్జ్ బెజవాడ గణపతి రావు, బూత్ కన్వీనర్ పజ్జురు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించండి

**తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టండి**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**

**ఆర్.డబ్ల్యూ.ఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో సమావేశం**



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** పల్లెల్లో ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలని, జవాబుదారీతనంతో వ్యవహరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అధికారులకు నిర్దేశించారు. విజయవాడ రూరల్ మండలం లోని గొల్లపూడిలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయితీ రాజ్ అధికారులు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేకంగా శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో గ్రామపంచాయతీల బాధ్యత ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాలు ఏర్పాటు, రహదారి సౌకర్యాలను మెరుగు పరచడానికి ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలు ముందుగానే గుర్తించి ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. తాగునీటి పైపులైన్ల నిర్వహణ సమర్ధవంతంగా ఉండాలని అన్నారు. పల్లెపండుగ 2.0లో భాగంగా శంకుస్థాపన చేసిన సిమెంట్ రహదారులు, ఇతరత్రా పనులు సాధ్యమైనంత త్వరగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శక సేవలు అందిస్తూ ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999